

మనమరాలే మోసం చేసింది!
» వృద్ధురాలి బంగారం అపహరణ కేసులో మనుమరాలు, మునిమనుమరాలు అరెస్టు 7

రెండో రోజుకు సైనిక విన్యాసాలు 6

ఏపీఈఏపీసెట్‌కు 2,83,070 దరఖాస్తులు 7



పల్లె నుంచి.. పదవుల పల్లకీలోకి..
» తెలుగుదేశంలోనే రాజకీయ అరంగేట్రం
» తొలిసారే ఎమ్మెల్యే.. మంత్రి కూడా..
» 42 ఏళ్లు ఒకే పార్టీ.. ఒకటే జెండా
» ఏవీ నగరానికి కీర్తికిరీటం యనమల
» నేడు తునిలో రాజకీయ ప్రస్థాన సభ 6
» పుస్తకావిష్కరణ.. ఫొటో గ్యాలరీ ఏర్పాటు




అర్ధరాత్రి అలజడి!
» బాణసంచా కాల్పుల్లో విస్ఫోటనం
» భయంతో రోడ్లపైకి వచ్చిన ప్రజలు
» రామచంద్రపురంలో ప్రకంపనలు
» పగిలిన వాణిజ్య భవనాల అద్దాలు
» రూ.18.20 లక్షల ఆస్తినష్టం 7

వయసు 33.. కేసులు 69
● 16 ఏళ్ల నుంచే చోరీలు
● అంతర్ జిల్లా దొంగ ఆట కట్టించిన పోలీసులు 7

పాస్టర్ ప్రవీణ్ మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు : ఎస్పీ 7

# రుణం.. రణం!





ఇటీవల బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

» ప్రజాప్రతినిధులకు 'సవాల్'గా మారిన కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక
» ఉమ్మడి జిల్లాలో బీసీ, కాపు కార్పొరేషన్లకు 7,303 యూనిట్లు మంజూరు
» అందిన దరఖాస్తులు 1,11,038.. అర్హత సాధించిన వారు స్వల్పమే
» లబ్ధిదారులకు షాక్ ఇస్తున్న బ్యాంకులు.. రుణాల కోసం ఎమ్మెల్యేలపై ఒత్తిడి
» కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దరఖాస్తుదారులు

(కాకినాడ, అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ సామాజికవర్గాల వారికి రుణాల పంపిణీ కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్లకంటే 15 రెట్లు అధికంగా దరఖాస్తులు పోటెత్తాయి. దాంతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికార యంత్రాంగం అష్టకష్టాలు పడుతోంది. మరోవైపు దరఖాస్తుదారుల ఒత్తిడితో అర్హులైన లబ్ధిదారులను సిఫారసు చేసేందుకు ఎమ్మెల్యేలు సైతం ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ కింద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లకు సంబంధించి 7,303 యూనిట్లు మంజూరు కాగా వాటికోసం 15 రెట్లు అధికంగా అంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లక్షా 11వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిని ఆయా పట్టణాలు, కార్పొరేషన్లు, మండలాల వారీగా ఇటీవల అధికారులు ఇంటర్వ్యూలకు పిలిచి రుణాలకు అర్హులైన లబ్ధిదారుల అన్వేషణలో పడ్డారు. ఈ దశలోనే రాజకీయ ఒత్తిళ్లతో రుణాలు తమకే మంజూరు చేయాలంటూ పట్టణ, మండల స్థాయి ప్రజాప్రతినిధుల ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, మరికొందరైతే మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సుల పేరుతో రుణ మంజూరు కోసం పైరవీలు చేస్తున్నారు. ఈ పరిణామాలు ప్రస్తుతం కూటమి ప్రజాప్రతినిధులకు ప్రాణసంకటంగా మారింది. ఎవరిని నొప్పించినా రానున్న రోజుల్లో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతాయనే ఆందోళన వారిలో కనిపిస్తోంది.

## దరఖాస్తుదారులు 15 రెట్లు అధికం..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 7,303 యూనిట్లకుగాను మొత్తం 1,11,038 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో బీసీ కార్పొరేషన్ ద్వారా 63,412 మంది. కాపు కార్పొరేషన్ల ద్వారా 45,290, ఈడబ్ల్యుఎస్ కింద 2336 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వాటన్నింటినీ ఆయా కార్పొరేషన్‌కు చెందిన అధికారులు విశ్లేషించి అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటిలో భాగంగా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం కాకినాడ జిల్లాలో 1,895 యూనిట్లకోసం 31,856 మంది దరఖాస్తు చేశారు. వారిలో ఆయా మండలాలకు చెందిన అధికారులు 777 మందిని ఎంపిక చేయగా 245 మందికి రుణాలు ఇచ్చేందుకు ప్రస్తుతం బ్యాంకర్లు అంగీకరించారు. అదే విధంగా కాపు కార్పొరేషన్ కోసం 775 యూనిట్ల కోసం 21,455 మంది దరఖాస్తు చేయగా వారిలో 390 మందిని అధికారులు ఎంపిక చేశారు. 106 మందికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బీసీ కార్పొరేషన్‌కు 1,366 రుణాలు లక్ష్యం కాగా 15,148 మంది దరఖాస్తు చేశారు. వారిలో మండలస్థాయిలో అధికారులు 399 మందిని ఎంపిక చేయగా కేవలం 22 మంది లబ్ధిదారులకు మాత్రమే రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయి. అదేవిధంగా కాపు కార్పొరేషన్ ద్వారా 756 యూనిట్ల లక్ష్యం కాగా 15,643 మంది దరఖాస్తు చేశారు. మండలస్థాయి అధికారులు ఇప్పటివరకు 343 మందిని ఎంపిక చేశారు. కేవలం 16 మందికే బ్యాంకులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. తూర్పుగోదావరికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా 1,341 యూనిట్లు లక్ష్యంగా కాగా ఇందుకోసం 16,408 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో అధికారులు 243 మందిని ఎంపిక చేయగా బ్యాంకులు మాత్రం 23 మంది లబ్ధిదారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 758 యూనిట్ల లక్ష్యం కాగా 8,192 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 174 మందిని అధికారులు ఎంపిక చేయగా కేవలం తొమ్మిది మందికి మాత్రమే ఇప్పటికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించాయి.

### ఎమ్మెల్యేలకు శిరోభారం..

బీసీ, కాపు కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ రుణాలకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలపై తీవ్ర ఒత్తిడి ప్రారంభమైంది. తమ వారికే రుణాలు మంజూరుచేసేలా సిఫార్సులు చేయాలంటూ లబ్ధిదారులను వెంటేసుకుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు వారి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నాయని, మేము పెట్టుకున్న లోన్లు మంజూరు చేయకపోతే గ్రామాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాల్సి వస్తుందంటూ కొందరు పరోక్ష హెచ్చరికలు చేస్తున్నారు. అయితే రుణాల మంజూరులో గానీ, లబ్ధిదారుల ఎంపికలో గానీ తమ ప్రమేయం ఏమీ ఉండదని, అభ్యర్థుల అర్హతలు, వారు పెట్టుకునే వ్యాపారాలకు సంబంధించి యూనిట్లు, బ్యాంకుల్లో వారికి ఉన్న సిబిల్ స్కోర్ వంటి వాటిని పరిగణలోకి తీసుకుని కార్పొరేషన్ అధికారులు రుణాలు మంజూరు చేస్తారని ప్రజాప్రతినిధులు నచ్చచెబుతున్నారు. ఇక దరఖాస్తుల సమయంలో ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా ఇప్పుడు వార్డుకు ఒకటి, గ్రామానికి ఒకటి లోన్లు ఇస్తే ఎలాగంటూ నేతలు తలలుపట్టుకుంటున్నారు.

### బీసీ రుణాలు.. సబ్సిడీలు..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

బీసీలకు ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంక్ రుణాలతో ఈ సహాయం అందుతుంది. యూనిట్ విలువ రూ.2 లక్షల వరకూ ఉంటే సబ్సిడీ 50 శాతం లేదా, రూ.75 వేలు మించకుండా ఉంటుంది. యూనిట్ కాస్ట్ రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకూ ఉంటే 50 శాతం లేదా, రూ.1,25,000వరకూ సబ్సిడీ ఉంటుంది. రూ.3 లక్షల నుంచి 5లక్షల వరకూ యూనిట్ విలువ ఉంటే, సబ్సిడీ రూ.2 లక్షల వరకూ ఉంటుంది. జనరిక్ మెడికల్ షాపులకు కూడా రుణాలు ఇస్తున్నారు. రూ.8 లక్షల విలువ ఉంటే రూ.4 లక్షలు సబ్సిడీ లభిస్తోంది. మేదర, కుమ్మర శాలివాహన వారికి బుట్టల అల్లకం, కుండల తయారీకి రుణమిస్తారు. యూనిట్ కాస్ట్ రూ.3 లక్షలుంటే రూ.1.5 లక్షల సబ్సిడీ ఉంటుంది. మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ పథకం కింద రూ.25 లక్షల వరకూ యూనిట్ విలువ ఉంటుంది. ఇందులో రూ.10 లక్షలు సబ్సిడీ, రూ.10 లక్షలు బ్యాంక్ రుణం, రూ.5 లక్షలు లబ్ధిదారుడి వాటా.

# టీడీపీ ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

» వివిధ సమస్యలపై ప్రజలనుంచి 157 దరఖాస్తులు
» కాకినాడలో పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహణ
» ఇకపై ప్రతి బుధవారం వినతుల స్వీకరణ



కాకినాడలోని టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్ వినతుల స్వీకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జిల్లా కేంద్రం కాకినాడలో ఏర్పాటు చేసిన ఈ ప్రజాదర్బార్‌లో తమ సమస్యలపై వినతులు అందజేసేందుకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మొత్తం 157 దరఖాస్తులు అందాయి. టీడీపీ జిల్లాఅధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి వినతులు స్వీకరించారు. కార్యకర్తలు అందజేసిన వినతులు పార్టీ అధిష్ఠానానికి, ప్రజలు అందజేసిన అర్జీలు జిల్లా అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపనున్నట్లు జిల్లా అధ్యక్షుడు నవీన్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లానాయకులు ఎండీ జహీరుద్దీన్ జిలాని, వాసిరెడ్డి ఏసుదాసు, పెంకే శ్రీనివాస బాబా, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు,నులుకుర్తి వెంకటేశ్వరరావు, కటకంశెట్టి బాబి, తోట నవీన్, కొల్లాబత్తుల అప్పారావు, బోళ్ల కృష్ణమోహన్, వండవల్లి వీర్రాజు, రామదేవు సీతయ్యదొర, వనమాడి మోహన వర్మ, మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, మేకా లక్ష్మణమూర్తి, గుత్తుల రమణ, సబ్బతి ఫణీశ్వరరావు పాల్గొన్నారు. తొలుత టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### కార్యకర్తల ఆవేదన

కాకినాడ రూరల్ నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జి లేకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటూ ఉప్పలంక గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొల్లు ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. ప్రజాదర్బార్ ప్రారంభానికి ముందు కార్యకర్తలు మాట్లాడడానికి అవకాశం ఇవ్వగా కాకినాడ రూరల్, పిఠాపురం నియోజకవర్గాల కార్యకర్తలు అధినాయకత్వం తీరుపై ఆవేదన వెలిబుచ్చారు.

## ప్రజాదర్బార్ వేదికపై నేతల వాణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్, చిత్రంలో ఎంపీ సతీష్‌బాబు, ఎమ్మెల్యే చినరాజప్ప, నేతలు వర్మ, పిల్లి సత్తిబాబు, చిక్కాల

కాకినాడ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న కార్యకర్తలకు పార్టీ అధిష్ఠానం అండగా నిలవాలని టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ముక్తకంఠంతో వెల్లడించారు. కాకినాడ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్ర జాదర్బార్‌లో టీడీపీ ఎమ్మెల్యేలు మాట్లాడారు.

కాకినాడ రూరల్, పిఠాపురం నియోజకవర్గాల్లో నెలకొన్న ఇబ్బందులను పార్టీ అధిష్ఠానం పరిష్కరించాలని పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. పార్టీ ఆదేశాల ప్రకారం పార్టీ పరంగా ఒకటి, సమస్యలపై ఒకటి గ్రీవెన్స్ నిర్వహించడం చాలా మంచి కార్యక్రమం అన్నారు. సమస్యలపై రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు స్పందించాలన్నారు. ముఖ్యంగా వైసీపీ నాయకులు కొందరు టీడీపీలోకి చేరిపోయారని, ప్రస్తుతం వారు మన కార్యకర్తలను ఇబ్బంది పెట్టేలా తయారయ్యారని, అలా ఇబ్బంది పడిన వారిలో తాను కూడా ఉన్నానని రాజప్ప తెలిపారు. పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలైందని, ఐదు నియోజకవర్గాల్లో ఇబ్బందులు లేవని, రెండు నియోజవర్గాల్లో ఇబ్బందులున్నాయన్నారు. వాటిని ఎలా పరిష్కరించుకోవాలి, కూటమి ధర్మాన్ని ఎలా కాపాడుకోవాలి అనే విషయమై అందరూ ఆలోచించాలన్నారు. ప్రతి బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో, నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ చిక్కాల మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను, పార్టీ సమస్యలపై వేర్వేరుగా గ్రీవెన్స్ నిర్వహించి వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత పార్టీ అధిష్ఠానంపై ఉందన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. కాకినాడ జిల్లాలో పార్టీ పరిస్థితి ఇబ్బందిగానే ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ.. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్టీ సీనియర్ నేతల సూచనలను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. లోకేశ్ పాదయాత్రతోనే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు తెలిపారు. కార్యకర్తల అసంతృప్తి, ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ నిర్వహించామన్నారు. కాకినాడ రూరల్, పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో పరిష్కారం కాని సమస్యలను ఢిల్లీ స్థాయిలో వీలైతే పరిష్కరించేలా, నిధులు తీసుకొచ్చేలా చూస్తానన్నారు.

## అవగాహనతో రెవెన్యూ సమస్యల పరిష్కారం

జేసీ రాహుల్‌మీనా



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వ సూచనలను, నియమ నిబంధనలపై రెవెన్యూ అధికారులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. గత నెల రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సూచించిన భూముల పరాయీకరణ, 22ఏ జాబితాలో ప్రైవేట్ భూములను ఉంచడం, ల్యాండ్ రెగ్యులరైజేషన్, అసైన్‌మెంట్, ఇనామ్, ఎస్టేట్ రద్దు, రీసర్వేల తదితర అంశాలపై ప్రస్తుతం ఉన్న నియమ నిబంధనలతోపాటు అదనంగా ఏవిధమైన ప్రక్రియను చేపడితే రెవెన్యూ శాఖలో ఉత్పన్నమవుతున్న సమస్యలకు పురోగతి సాధించవచ్చనే అనే అంశంపై బుధవారం జేసీ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుతో కలిసి కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, కేఎస్ఈజెడ్, సర్వే అధికారులు, తహశీల్దార్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలు నమోదవుతున్నాయని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సూచనలు, నియమ నిబంధనలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా అవగాహన పెంపొందించుకొని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు,శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరం.. పట్టించుకోరా?



శిథిలస్థితిలో ఉన్న కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురం ప్రధాన వంతెన

శిథిలావస్థలో ఎస్.తిమ్మాపురం వంతెన
భయపడుతున్న వాహనదారులు



వంతెన పెచ్చులూడుతున్న దృశ్యం

కిర్లంపూడి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలంలోని ఎస్.తిమ్మాపురం వంతెన ప్రమాదకరంగా మారింది. భూపాలపట్నం, గెద్దనాపల్లి గ్రామాల వారు ఈ వంతెన మీదుగా కిర్లంపూడి వెళ్తుంటారు. అటు యర్రవరం, ఎస్.తిమ్మాపురం నుంచి తామరాడ, గోనేడ తదితర సుమారు 20 గ్రామాలకు ప్రధాన రహదారిలో ఉన్న వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. భారీ వాహనాలు వెళితే ఇక అంతే సంగతులు. వంతెన కింద భాగాన ఊసలు, సిమెంటు పెచ్చులు ఊడి వేలాడుతున్నాయి. ఇరువైపులా రైలింజన్లు పోవడంతో రాకపోకలు సాగించేందుకు ఆటోలు, ద్విచక్రవాహనదారులు భయపడుతున్నారు. ప్రభుత్వం కొత్తనిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

## ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 0-6సంవత్సరాల మధ్య ఉన్న చిన్నారు లకు వెంటనే ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించాలని, ఆధార్ నంబర్ లేని చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహార సేవలు నిలిపివేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకి నాడ కలెక్టరేట్‌లో బుధవారం స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి, సీడీపీవోలు, పోస్టల్ డిపార్ట్‌మెంట్, సీఎస్సీ, ఆధార్, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందుతున్న 0-6 సంవ త్సరాల చిన్నారులకు రానున్న మే నెల నుంచి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహార సేవలను నిలిపివేయాలన్నారు. ఆధార్ రిజి స్ట్రేషన్ కోసం ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. సీడీపీ వోలు, పోస్టల్, ఆధార్ రిజిస్ట్రేషన్ కోఆర్డినేటర్స్ సమన్వయంతో పని చేసి ఈ ఆధార్ క్యాంపు నిర్వహణ సజావుగా సాగేలా చూడాలన్నారు. కొత్త ఆధార్ రిజిస్ట్రేషన్ కోసం పోస్టల్ ఆధార్ సెంటర్లు, సీఎస్సీ సెంటర్లలోను, ఆధార్‌లో మార్పులు, చేర్పులను సబ్‌పోస్ట్ ఆఫీస్, సచివాలయాల్లోను చేపట్టాలన్నారు. అంగన్వాడీలోని మౌలిక సదుపాయాలు ఇతర మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, సీడీపీవోలు, పోస్టల్ ఆధార్ మేనేజర్ రాజ్‌కుమార్, సీఎస్‌ఈ ఆధార్ మేనేజర్ ఆదిత్య తదితరులు ఉన్నారు.

## జిల్లాలో బాల్య వివాహాలు నియంత్రించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ న్యూఢిల్లీ ఆదేశించింది. కమిషన్ ప్రతినిధులు న్యూఢిల్లీ నుంచి కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుతో వీడియో కాన్ఫరెన్స్‌లో బుధవారం మాట్లాడారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాల నియంత్రణకు గ్రామ మహిళ కార్యదర్శి, వీఆర్‌వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా నిరంతర నిఘా ఉంచాలని అధికారులను కోరారు. బాల్య వివాహాలు నమోదైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు ఇచ్చారు. గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు విధిగా ప్రతినెలా మొదటి శుక్రవారం, మూడో శుక్రవారం సమావేశం అవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమ అధికారి విజయకుమారి, శక్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఇతర అధికారులు బుల్లిరాణి, శ్రీరామ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హతగల బీసీ, ఎస్సీ,ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ త్వరలో అందించబోతున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారిణి ఎం.లల్లీ తెలిపారు. రాబోయే మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ తీసుకోవడానికి ఆసక్తిగల, అర్హులైన బీసీ ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులనుంచి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. టెట్ అర్హత సాధించిన ఈ జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైన పత్రాలను జతపరిచి బీసీ సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు 08842379216 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

# పల్లె నుంచి పదవుల పల్లకీలోకి...

**42 ఏళ్లు ఒకే పార్టీ... ఒకటే జెండా**
**ఏవీ నగరానికి కీర్తి కిరీటం**
**యనమల రామకృష్ణుడు**

తొండంగి/తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతానికి చేరువలో ఉన్న అతి చిన్న గ్రామం ఏవీ నగరం. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో ఉన్న ఈ గ్రామాన్ని రాష్ట్ర రాజకీయ యవనికపై ఘనంగా నిలిపిన ఘనత టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుకే దక్కుతుంది. 42 ఏళ్ల ఆయన రాజకీయ ప్రస్థానంలో యనమల ఉన్నతిని చూసి స్వగ్రామమైన ఏవీ నగరం మురిసింది. ఈ గ్రామం అంటే ఆయనకూ అంతే ప్రేమ. రాష్ట్రంలో కీలకమైన పాలనా బాధ్యతలు భుజాన మోస్తున్న తరుణంలో కూడా సొంతూరికి వెళ్లి రావడానికే ఎప్పుడూ తొలి ప్రాధాన్యమే ఇచ్చారు. యనమల అప్పారావు-సరస్వతి దంపతులకు ఆఖరి సంతానం రామకృష్ణుడు. ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలోనే. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు సమీపంలోని రావికంపాడు ఉన్నత పాఠశాలలోను, పది నుంచి డిగ్రీ వరకు రాజమహేంద్రవరంలోను విద్యాభ్యాసం చేశారు. ఎంఏ, ఎల్‌ఎల్‌బీ మధ్యప్రదేశ్‌లో చదివారు. అనంతరం కాకినాడలో న్యాయవాద వృత్తి చేపట్టారు.

**రాజకీయ ప్రస్థానం ఇలా...**

అప్పటి కాంగ్రెస్ రాజకీయాలతో విసిగి వేసారిన తుని ప్రాంత ప్రజలు ఐక్య సంఘంగా ఏర్పడి ఎన్నికల బరిలో నిలిపేందుకు అనువైన అభ్యర్థి కోసం వెతుకుతున్న సందర్భంలో సామాజికపరంగాను, విద్యాపరంగాను అన్ని అర్హతలు ఉన్న యనమల రామకృష్ణుడు వారి దృష్టిని ఆకర్షించారు. అదే సమయంలో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రకటించడంతో ఐక్య సంఘం మొత్తం యనమల వెంట నిలిచి ఆయన్ను తుని నుంచి బరిలోకి దింపేందుకు కృషి చేసింది. అత్యున్నత విద్యార్హతలతో పాటు మృదుస్వభావం ఉన్న యనమల ఎన్టీఆర్ దృష్టిని కూడా ఆకర్షించడంతో ఆయన రాజకీయ ప్రస్థానానికి అంకురార్పణ జరిగింది. 1983లో తుని నుంచి యనమల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. నాటి నుంచి వరుసగా ఒకే పార్టీ ఒకే గుర్తుపై ఆరుసార్లు ఎన్నికయ్యారు. రెండుసార్లు శాసనమండలి సభ్యునిగా పనిచేశారు. మొదటి గెలుపులోనే పురపాలక, న్యాయ శాఖ మంత్రిగా అతిపిన్న వయసులో పదవి చేపట్టారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ఆయనకు ఉన్నత పదవులు దక్కాయి. మేధావిగా, పార్టీ సిద్ధాంతకర్తగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా, శాసనసభ స్పీకర్‌గా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా, శాసనమండలి ప్రతిపక్ష నేతగా... పదవులకే వన్నె తెచ్చారు. ఎన్ని పదవులు చేపట్టినా ఆయన స్వగ్రామానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటికీ ఆయన తన ఓటు హక్కును స్వగ్రామంలోనే వినియోగించుకుంటున్నారు.



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుతో రామకృష్ణుడు

పుట్టిన ఊరు రుణం తీర్చుకునేందుకు యనమల తమ స్వగ్రామమైన ఏవీ నగరంలో అనేక ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయాలను నిర్మించి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అనేక మంది పీఠాధిపతులు, ప్రవచనకర్తలు ఆలయాన్ని సందర్శించారు. 2014లో యనమల ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనేక మెడికల్ క్యాంపులు నిర్వహించారు. స్థానిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ సదుపాయం కల్పించారు. విద్యార్థులకు లక్షలాది రూపాయలను ఉపకార వేతనాలుగా అందించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించారు. గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారు. అనేక క్రీడా పోటీలు నిర్వహించారు. దీంతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. 42 సంవత్సరాల ప్రస్థానంలో స్వగ్రామం ఆయన వెన్నంటి నిలిచింది. అదే రీతిలో యనమల కన్న ఊరును మరిచిపోకుండా ఇప్పటికీ ఏవీ నగరం బిడ్డగానే మసలుతున్నారు.



చంద్రబాబునాయుడుతో యనమల

## నేడు తునిలో '42 వసంతాల రాజకీయ ప్రస్థానం' పుస్తకావిష్కరణ

తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యనమల రామకృష్ణుడు 42 వసంతాల రాజకీయ ప్రస్థానం సభ, పుస్తకావిష్కరణ గురువారం సాయంత్రం తునిలో జరగనున్నాయి. టీడీపీ తుని నియోజకవర్గ శ్రేణుల ఆధ్వర్యంలో తుని పట్టణ శివారులోని సాయి వేదిక ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేస్తారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఫొటో గ్యాలరీని ప్రారంభిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సీనియర్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్టు పార్టీ నాయకులు చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు ఆరువేల మందికి పైగా తరలివస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేశారు. సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య బుధవారం పరిశీలించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివ్య

# రెండో రోజుకు సైనిక విన్యాసాలు



ఆకాశంలో చక్కర్లు కొడుతున్న యుద్ధ విమానం

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయింఫ్ సైనిక విన్యాసాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం యుద్ధ విమానాలు ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికాదళం, అమెరికా (యూఎస్) యాంఫీబియాస్ విన్యాసాల్లో భాగంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఇరు దేశాలు సంయుక్తంగా సముద్రం, ఆకాశంలో సైనిక విన్యాసాలు నిర్వహించాయి. టైగర్ ట్రయింఫ్ యాంఫీబియాస్ విన్యాసాలు ఈ నెల 13వ తేదీ వరకు జరుగుతాయని త్రివిధ దళాల అధి కారులు తెలిపారు. విన్యాసాలు జరిగే ఔటర్ ప్రాంతాలను కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత పర్యవేక్షించారు.




సూర్యారావుపేట తీర ప్రాంతంలో యుద్ధ ట్యాంకర్లు, వాహనాలు

# అంతర్వేదిలో సాగర్ కవాచ్



బోటును తనిఖీ చేస్తున్న మెరైన్ పోలీసులు

అంతర్వేది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీర ప్రాంతంలో మెరైన్ పోలీసులు, సీఐ అల్లు నవీన్ నరసింహ ఆధ్వర్యంలో బుధవారం సాగర్ కవాచ్ నిర్వహించారు. ముష్కరులను పట్టుకునేందుకు అంతర్వేదిలో పోలీసు, మెరైన్ సిబ్బంది 58 మందితో, పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెంలో 68 మందితో సాగర్ కవాచ్ నిర్వహించారు. గురువారం కూడా సాగర్ కవాచ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు కె.దుర్గాశ్రీనివాస్, నాగరాజు, వీరాస్వామిరాజు పాల్గొన్నారు. బుధవారం తీర ప్రాంతమైన అల్లవరం మండలం ఓడలరేవు నుంచి అంతర్వేది మీదుగా పేరుపాలెం వరకు సాగర్ కవాచ్ నిర్వహించారు.





## రైతు కావ్యానికి ఉత్తమ దీర్ఘ కవితా పురస్కారం

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా అత్యుత్తమ దీర్ఘ కవితా పురస్కారం 'వచన కవితా సహస్రావధాని' ర్యాలి ప్రసాద్ రచించిన రైతు కావ్యానికి లభించింది. భారతదేశంలోని రైతుల దుర్భర జీవితాన్ని, రైతుల ఆవశ్యకతను తెలుపుతూ రచించిన ఈ కావ్యం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, ప్రతి ఒక్క రైతు విలువను తెలిపేలా రచయిత ఈ కావ్యాన్ని రచించారని ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య మక్కెన శ్రీను తెలిపారు. ఈ నెల చివరి వారంలో పురస్కార ప్రదానోత్సవం ఉంటుందని చెప్పారు. ప్రసాద్‌ను పలువురు సాహితీవేత్తలు, ఆదిత్య యూనివర్శిటీ చాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి, కాకినాడ రచయితల సంఘం ఉపాధ్యక్షుడు గొడవర్తి సత్యమూర్తి, కార్యదర్శి టీవీపీ సత్యనారాయణ, కోశాధికారి వడిశెట్టి భాస్కరరెడ్డి, కార్యవర్గ సభ్యులు అభినందించారు.



రచయిత ర్యాలి ప్రసాద్

# ఏపీఈఏపీసెట్‌కు 2,83,070 దరఖాస్తులు

- మే 19 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు
- అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు
- కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు



ఏపీఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్)-2025కు ఇప్పటివరకు 2,83,070మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు బుధవారం 'ఆంధ్ర జ్యోతి'కి తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,22,989 మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 59,507మంది, రెండింటికీ 574 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, మే 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏపీలో 46, తెలంగాణలోని హైదరాబాద్‌లో 2కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. గత ఏడాది వరకు తెలంగాణ ఈఏపీసెట్‌కు ఏపీ విద్యార్థులు, ఏపీఈఏపీసెట్‌కు తెలంగాణ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేవారు. కానీ రెండు రాష్ట్రాలు నాన్ లోకల్ కోటా తీసేయడంతో ఏపీ ఈఏపీసెట్‌కు ఈఏడాది సుమారు 30వేలకుపైగా దరఖాస్తులు పెరిగే అవకాశముందన్నారు. విద్యార్థులు https://cets. apsche. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

మే 19 నుంచి 20 వరకు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్లలో, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మే 21నుంచి 27 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మే 24న పరీక్ష ఒక సెషన్‌లో మాత్రమే ఉంటుందని 25న పరీక్ష ఉండదన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికి https:// cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారాగానీ 0884 2359599, 2342499 నెంబర్లలోగానీ helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారాగానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సుబ్బారావు సూచించారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే 'తలాష్'

- నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రసన్నశ్రీ

సర్పవరంజంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వ్యాపార దృక్పథం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచడంతో పాటు సృజనాత్మకతను వెలికితీసేందుకు 'తలాష్' ఫెస్ట్ ఉపయోగపడుతుందని నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో కామర్స్-మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో తలాష్-2కే25 జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ ఉత్సవాన్ని ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాం తిశ్రీతో కలిసి ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసన్నశ్రీ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సవాళ్లను ఎదుర్కోవడానికి ఇటువంటి నాలెడ్జ్‌ఫెస్ట్‌లు ఉపయోగపడతాయన్నారు. ప్రతి విషయాన్నీ సృజనాత్మకతతో ఆలోచించడం అలవర్చుకోవాలని, పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు కొం గొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు చేయడంతో నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చక్కని కార్యక్రమం నిర్వహించిన కామర్స్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులను అభినందించారు. ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాత్ గుప్త మాట్లాడుతూ ఈ ఫెస్ట్ ఉద్యోగ అవకాశాలకు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. మేనేజ్‌మెంట్ గేమ్స్ విభాగంలో కార్పొరేట్ చాలెంజ్, ట్రేడింగ్ టైటాన్స్, బిజినెస్ ఆర్కిటెక్ట్స్, స్ట్రాటజీ సీకర్స్, కేస్‌ఏ మేనియా, నెక్స్ట్ బాస్, ట్రెజర్ హంట్, స్పీక్ స్మార్ట్ వంటి పోటీల పట్ల విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరిచారు. విద్యార్థులకు నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటలు, మిస్టర్ అండ్ మిస్ తలాష్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రోగ్రామ్, కామర్స్ మేనేజ్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ డి.అజయ్ రతన్, ఓఎన్జీసీ జీఎం (హెచ్ఆర్) కె.సునీల్, అధ్యాపకులు డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ మధుకుమార్, మణికంఠేశ్వర్‌రెడ్డి, మనోజ్ దేవ, డాక్టర్ అప్పారావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమారజిత, తాడేపల్లిగూడెం క్యాంపస్, ఆదిత్య, పైడా, సంజీవి, ప్రకాష్, స్పేస్, ఏఎస్‌డీ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.





సదస్సులో మాట్లాడుతున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ



గన్నవరంలో కల్లంలో తడిసిన మిర్చిపంట

# అకాల వర్షం..

- కల్లాల్లో మిర్చికి దెబ్బ
- ధర, దిగుబడిలేక ఇప్పటికే రైతు కుదేలు

ఎటపాక ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి: అకాల వర్షం మిర్చి రైతుని మరోమారు నష్టాల ఊబిలోకి నెట్టింది. బుధవారం రాత్రి గాలి వానతో వర్షం కురిసింది. దాంతో ఇప్పటికే కోతలు నిర్వహించి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిపంట తడిసిపోయింది. కొందరు రైతులు ముందుగా వాతావరణ పరిస్థితు లను గమనించి ఆరబెట్టిన పంట, మిర్చి రాశులపై టార్పాలిన్లు, బరకాలు రక్షణగా కప్పారు. అయినా చాలాచోట్ల వర్షం రాకను గమనించకపోవడంతో కల్లాల్లో ని పంట తడిసిపోయింది. దీంతో పంట తడ వడంతో రంగుమారి నాణ్యత కోల్పోయి ధర తక్కువగా పలుకుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పంటకు సరైన ధర, దిగుబడిలేక కుదేలైన రైతుకు వర్షం మరో ఎదురుదెబ్బలా తగిలినట్టైంది. ఏజెన్సీలో ఈనె లాఖరు వరకు మిర్చి కోతల పనులు చేపట్టనున్నారు.



నందిగామలో మిర్చిపై కప్పిన టార్పాలిన్లు

## నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం రూ.18.25లక్షలు



చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర ఉత్సవం అనంతరం హుండీల లెక్కింపు బుధవారం నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.18,25,424లు లభించింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవప్రత్యేకాధికారి బాలాజీరామ్‌ప్రసాద్‌ల ఆధ్వర్యంలో హుండీలను తెరచి లెక్కించారు. మార్చి 27నుంచి ప్రారంభమైన జాతర ఉత్సవాలకు ముందు హుండీలను లెక్కించగా ఉత్సవాల తదుపరి బుధవారం లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవా కమిటీ చైర్మన్ గన్ని వెంకట్రావు, మాజీ చైర్మన్‌లు వైట్ల శేషబాబు, దొమ్మేటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### నూకాంబిక జాతర ఆదాయం రూ.54.07లక్షలు

చింతలూరు నూకాంబికా అమ్మవారి జారత ఉత్సవాల సందర్భంగా రూ.54.07లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వీర్రాజుచౌదరి తెలిపారు. జాతర ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వేలంపాటల ద్వారా రూ.13,13 లక్షలు, టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.16.48లక్షలు, భక్తుల విరాళాలు రూ.3.88లక్షలు, షాపుల ద్వారా రూ.2.15లక్షలు, అమ్మవారి పొన్నుల ద్వారా రూ.17.8వేలు, వివిధ ఆదాయాల ద్వారా రూ.44వేలు, హుండీ ద్వారా రూ.18,25,424లు ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

# వైభవంగా పొన్నవాహన మహోత్సవం

- మూడో రోజు స్వామివారి శ్రీకల్యాణోత్సవాలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణమహోత్సవాలలో భాగంగా మూడోరోజు బుధవారం స్వామివారి మేలుకొల్పు, గౌతమినది నుంచి తీర్థపు బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించారు. విశేష అర్చన, నిత్యహోమాలు, బలిహరణ, ద్రవిడవేద పారాయణం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం వైఖానస ఆగమ శాస్త్రప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ప్రధాన హోమాలు, దిగ్దేవత బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. తణుకు సత్యాపురానికి చెందిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి 7.01నిమిషానికి ఉభయదేవేరేలుతో స్వామివారు పొన్నవాహనంపై అలంకృతుడయ్యారు. మేళతాళ మంగళవాయిద్యాలు వేదమంత్రోచ్చరణల నడుమ తిరువీధులలో పొన్నవాహనసేవ ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. విద్యుత్‌కాంతులనడుమ ఉత్స వాలను నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు.



పొన్నవాహనంపై శ్రీవారు





గోదావరి నదీజలాలను తీర్థపు బిందెతో తీసుకువస్తున్న దృశ్యం, పొన్నవాహన మహోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

# అర్ధరాత్రి అలజడి!

- బాణసంచా కాల్పుల్లో భారీ విస్ఫోటనం
- భయంతో రోడ్లపైకి వచ్చిన ప్రజలు
- రామచంద్రపురంలో కంపించిన భవనాలు
- పగిలిన వాణిజ్య సముదాయాలు, భవనాల అద్దాలు, రూ.18.20 లక్షల ఆస్తినష్టం


విస్ఫోటనం జరిగిన ప్రాంతం

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మార్కెట్ సెంటర్ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ సంబరాల్లో అపశృతి చోటుచేసుకుంది. సంబరాల్లో మంగళవారం అర్ధరాత్రి 12.51 గంటలకు బాణసంచా కాల్పుల్లో భారీ విస్ఫోటనం సంభవించింది. పేలుడుధాటికి మార్కెట్ సెంటర్‌లోని రైతుబజార్ పరిసర ప్రాంతాల్లో వాణిజ్యసముదాయాలు, వికాస్ కళాశాల, సినిమా థియేటర్లు, పలు భవనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి. 1000 మీటర్ల వరకు పేలుడు ప్రభావం కనిపించింది. లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. అర్ధరాత్రి భవనాలు కంపించడంతో ప్రజలు భయాందోళనలు చెందారు. భయంతో రోడ్లపైకి చేరుకున్నారు.

### అసలేం జరిగిందంటే....

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో మంగళవారం రాత్రి నుంచి బాణసంచా కాల్పులు ప్రారంభించారు. 12.50 గంటల ప్రాంతంలో పేలుడు స్తంభం వెలిగించారు. అది దశలవారీగా పేలవలసి ఉంది. అయితే స్తంభానికి చుట్టిన నార ఔట్లు, టపాసులదండ జారి పోవడంతో భారీ విస్ఫోటనం సంభవించింది. పేలుడు ధాటికి పక్క నే ఉన్న వికాస్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్ అద్దాలు ధ్వంసం కావడంతో పాటు మూడో అంతస్తులో క్లాసురూముల్లో పీవోపి సీలింగ్ ఊడిపడిపోయింది. గోడలు బీటలు వారాయి. కళాశాల బస్సు అద్దాలు పగిలిపోయాయి. కంప్యూటర్ ల్యాబ్‌లో సీసీ కెమెరాలో పేలుడు ధాటికి అద్దాలు ధ్వంసం కావడం రికార్డుఅయింది. రెండు నిమిషాలకుపైగా అద్దాలు ధ్వంసం కావడం కనిపించింది. పక్కనే ఉన్న వెంకటరమణ సిమెంటు, ఐరన్‌ట్రేడర్స్ షాపుల సముదాయంలో నష్టం సంభవించింది. హావెల్స్ షోరూమ్, సెరా స్టైల్ సెంటర్ అద్దాలు పగిలిపోయాయి. షట్టర్లు వేసి ఉండగానే 18 అంగులాలు మందం కలిగిన అద్దాలు, డిస్‌ప్లే హోర్డింగులు, సీలింగులు ధ్వంసం అయ్యాయి. సమీపంలో కిషోర్ సినిమా థియేటర్, అన్నపూర్ణ థియేటర్ అద్దాలు పగిలిపోయాయి. లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. పేలుడు ధాటికి పలు భవనాలు కంపించడంతో భూకంపం ఏమైనా వచ్చిందా అనే భయంతో ప్రజలు ఆందోళన చెందారు. రోడ్లపైకి చేరుకున్నారు. బాణసంచా ప్రేలుడు నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. పేలుడు ధాటికి పలువురు గాయపడినట్లు తెలుస్తుంది. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స తీసుకుని వెళ్లిపోయినట్టు వైద్యులు తెలిపారు.



పేలుడుకు ధ్వంసం అయిన వికాస్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్, సెరా షోరూమ్ అద్దాలు


ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, అధికారులు

### అధికారులు, నాయకుల పరిశీలన

పేలుడు జరిగిన ప్రాంతం, సమీపంలో నష్టపోయిన వెంకటరమణ ట్రేడర్స్, వికాస్ కళాశాల ప్రాంతాలను ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్ పరిశీలించారు. రూ.18.20 లక్షలు ఆస్తినష్టం సంభవించినట్టు ఆర్డీవో తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం నష్టపోయిన వారిని పరామర్శించారు. విస్ఫోటనం ధాటికి నష్టపోయిన వెంకటరమణ ట్రేడర్స్, వికాస్ కళాశాల, సినియా థియేటర్లతో పాటు పలువురు భవనాల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. నష్టానికి కారణమైన ఆంజనేయ ఫైర్‌వర్క్స్ దవులూరి శివ, కమిటీ సభ్యులను అదుపులోకితీసుకుని విచారిస్తున్నామన్నారు.

## సీటీఎస్ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని వివిధ పరిశ్రమల్లో ట్రైనింగ్ అయిన అర్హులైన వారి నుంచి ప్రైవేట్ అభ్యర్థులుగా ఏఐటీఐ 2025 అండర్ (సీటీఎస్) పరీక్షలకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ డైరెక్టర్ కోరుతున్నారు. ప్రైవేట్‌గా ఐటీఐ ఆలిండియా ట్రేడ్ పరీక్ష రాసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో అందజేయాలని కన్వీనర్ జి.వేణుగోపాల్‌వర్మ కోరారు. ఐదేళ్ల తర్వాత ఈ అవకాశం కల్పిస్తున్నామని, మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ 9701215511 నెంబరును సంప్రదించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

## డెల్టాకు రబీ నీటి విడుదల నిలిపివేత

### సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్

మోతుగూడెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టాలోని రబీ పంటలకు సీలేరు నుంచి నీటి విడుదల నిలిపివేసినట్టు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. సీలేరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఫిబ్రవరి 10 నుంచి డొంకరాయి జలాశయంలో విద్యుదుత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. జల వనరుల శాఖాధికారుల సూచనమేరకు మంగళవారం నుంచి నీటి విడుదల నిలిపివేశామన్నారు. ఇప్పటివరకు గోదావరి డెల్టాకు డొంకరాయి జలాశయం నుంచి 15టీఎంసీల నీటిని విడుదల చేశామని, ప్రస్తుతం పవర్ కెనాల్ ద్వారా విద్యు దుత్పత్తి అనంతరం 4300క్యూసెక్కులు వెళ్తోందని తెలిపారు. ఉమ్మడి నిర్వహణలోని బలిమెల, డొంకరాయి జలాశయాల్లో 48నుంచి 50టీఎంసీలు నీటి నిల్వలున్నాయని, వర్షాకాలం వరకు విద్యుదుత్పత్తికి డోకా ఉండదని తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

### ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత


సమావేశంలో మాట్లాడుతున్న సునీత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందడంలో ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధత కలిగి బాధ్యతల్ని నిర్వర్తించాలని, ఆయా వర్గాలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదేశించారు. బుధవారం రాజమహేంద్రవరంలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో వివిధవర్గాలకు సామాజిక సాధికారత పథకాల అమలుపై సమన్వయ శాఖల అధికారులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీజే మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రారంభించి వాటిని అర్హులకు అందే విధంగా వారిని చైతన్యవంతం చేయాలన్నారు. నిరుపేదలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశంపెట్టడం జరుగుతోందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై న్యాయ సేవాధికార సంస్థల సిబ్బంది కూడా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలపై కార్యశాలలు నిర్వహించి పథకాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ వర్కర్లతో మమేకం కావడం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.గాయత్రి దేవి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, లీగల్ ఎయిడ్ డిప్యూటీ చీఫ్ పీఎంఆర్.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 400 కిలోల జీడిపప్పు.. మాడి బొగ్గాయే


విద్యుత్ సమస్యతో మాడి బొగ్గు అయిన జీడిపప్పు

మలికిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోపక్క వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరం సబ్‌స్టేషన్ వద్ద బ్రేకర్ లింబ్ వారం రోజుల క్రితం కాలిపోయింది. అధికారులు సరిగా స్పందించకపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. సర్దుబాటు చర్యల్లో భాగంగా మలికిపురం సబ్‌స్టేషన్ విద్యుత్‌తో అనుసంధానం చేశారు. మోరి, మోరిపోడులలో 12 జడీపప్పు ఫ్యాక్టరీలు ఉన్నాయి. మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో అధికారులు సరిగా స్పందించలేదు. విద్యుత్ ఒక ఫేస్ కాలిపోయి, రెండు ఫేస్‌లలో విద్యుత్ రావడం, దీనికి తోడు హై ఓల్టేజ్ రావడంతో పలు జీడిపప్పు ఫ్యాక్టరీల్లో మోటార్లు కాలిపోగా ముప్పర్తి సుబ్బారావుకు చెందిన జీడిపప్పు ఫ్యాక్టరీలో 400కిలోల జీడిపప్పు మాడి బొగ్గు అయిపోయింది. రూ.4లక్షల నష్టం వాటిల్లినట్టు ఫ్యాక్టరీ యజమాని తెలిపారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. తరచూ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి, టీడీపీ సఖినేటిపల్లి మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, జనసేన నేత బళ్ల రాము డిమాండ్ చేశారు.



## నల్లజర్ల మండలంలో... దారుణం!

- బాలబాలికలను లైంగికంగా వేధిస్తున్న వృద్ధుడు
- పోక్సో నమోదు.. పోలీసుల అదుపులో నిందితుడు
- కామాంధుడికి హెచ్ఐవీ ఉండడంతో తల్లిదండ్రుల ఆందోళన

నల్లజర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అసలే వృద్ధుడు.. పైగా హెచ్ఐవీ బాధితుడు. ముక్కుపచ్చలారని బడి పిల్లలపై లైంగిక చర్యలతో వేధించాడు. చాక్లెట్లు, బిస్కెట్లు ఎరచూపి వారితో జుగుప్సాకరమైన రీతిలో ప్రవర్తించాడు. విషయం బయటకు రావడంతో పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని ఓ గ్రామంలో అరవై ఏళ్ల వృద్ధుడికి హెచ్ఐవీ ఉంది. పాఠశాలలో నాలుగైదు తరగతులు చదువుకుంటున్న బాలబాలికలు పాఠశాల విడిచిన తర్వాత పక్కనే ఖాళీ స్థలంలో ఆడుకునేవారు. వారి తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లేవారు కావడంతో వారు వచ్చేదాకా అక్కడే పిల్లలంతా కాలక్షేపం చేసేవారు. ఇదే అదనుగా నిందితుడు అక్కడి పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చి మచ్చిక చేసుకుని సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలోకి తీసుకెళ్లేవాడు. ఏడు ఎనిమిదేళ్ల వయసున్న ముగ్గురు బాలురు, ఐదుగురు బాలికలను మభ్యపెట్టి తోటలో అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఇది గత నెల రోజులుగా జరుగుతున్నా వారంతా భయంతో ఎక్కడా నోరు విప్పలేదు. కానీ బాలికలతో పాటు కొంతమంది బాలురని కూడా తీసుకెళ్లడంతో ఆ విషయం ఒక బాలుడు తన తల్లికి చెప్పాడు. కానీ పిల్లల కుటుంబాల పరువుపోతుందే మోనని ఎవరూ ఈ విషయాన్ని బహిర్గతం చేయడానికి ముందుకు రాలేదు. ఇటీవల ఆ కాలనీలో ఒక బాల్య వివాహం ఆపడానికి ఐసీడీయస్ సిబ్బంది వెళ్లడంతో ఆ ప్రాంత ఆశ కార్యకర్త ఈ విషయాన్ని వారితో ప్రస్తావించారు. చివరకు మంగళవారం ఐదుగురు తల్లులు తమ పిల్లలను తీసుకుని ఐసీడీయస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి సహాయంతో సీఐ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన తల్లులను, పిల్లలను విడివిడిగా జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. బుధవారం తొమ్మిది మంది బాలబాలికలకు వైద్య పరీక్షలు చేయించారు. రిపోర్టు రావాల్సి ఉంది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్టు సీఐ రాంబాబు పేర్కొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు

### తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు కొనసాగుతుందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ స్పష్టం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఇతర కేసులపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతికి సంబంధించి వివిధ ఏజెన్సీలతో కలిపి పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ తదితర నివేదికలు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికీ ఎవరి వద్దనైనా ఏమైనా ఆధారాలుంటే పోలీసులకు సమర్పించాలని సూచించారు. వారు చెప్పే విషయాలు ఆధార సహితంగా ఉండాలని, వదంతులను ఆధారంగా తీసుకుని ప్రకటనలు చేయలేమన్నారు. సోషల్ మీడియాలో లేదా బహిరంగంగా, ఆధారరహితంగా ఏవైనా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వయసు 33.. కేసులు 69

- 16 ఏళ్ల నుంచే చోరీలు
- అంతర్ జిల్లా దొంగ ఆట కట్టించిన తూర్పు గోదావరి జిల్లా పోలీసులు
- 630 గ్రాముల బంగారు, 4కిలోల వెండి, సుమారు రూ.లక్ష నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చిన్న వయసు నుంచే చోరీల బాట పట్టాడు. ఆ సొమ్ముతో విలాసాలకు అలవాటు పడ్డాడు. ఎన్ని సార్లు జైలుకు వెళ్లొచ్చినా మార్పు రాలేదు. దొంగతనం చేయడం.. పట్టుబడితే జైలుకు వెళ్లడం.. తిరిగి రావడంతోనే మళ్లీ చోరీలు చేయడం.. ఇదే అతడికి దైనందిన జీవనంగా మారిపోయింది. దీంతో 33ఏళ్లకే 69 కేసులు నమోదయ్యాయి. ఉండ్రాజవరానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు పోలీసులు ఆ దొంగ ఆట కట్టించారు. ఈ మేరకు ఎస్పీ నరసింహ కిషోర్ వివరాలను వెల్లడించారు. భీమవరం టౌన్ పరిధిలోని గునుపూడికి చెందిన పందిరి వెంకట నారాయణ ప్రస్తుతం ఏలేశ్వరంలో ఉంటూ ఒక మహిళతో సహజీవనం చేస్తున్నాడు. తల్లిదండ్రులు కూలీలుగా జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. అన్నయ్య ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నారాయణ మాత్రం చిన్నతనం నుంచే విలాసాలకు అలవాటుపడి సొమ్ముల కోసం దొంగతనాల బాట పట్టాడు. తనకు 16ఏళ్ల వయసు ఉండగా 2008లో భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇనుప ముక్కలు, సైకిళ్ల దొంగతనం చేస్తూ మొదటిసారి పోలీసులకు పట్టుబడి జువైనల్ హోంకు వెళ్లొచ్చాడు. తర్వాత అవనిగడ్డకు చెందిన ఎలమంచిలి కృష్ణతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ దొంగతనాలు చేయడం ప్రారంభించారు. భీమవరం పోలీసులు పట్టుకుని మళ్లీ జువైనల్ హోంకి తరలించారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన తర్వాత 2014 నుంచి ఇళ్లలో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. జైలులో పరిచయం అయిన హైదరాబాద్‌కు చెందిన మంచం శ్రీనివాస్‌తో కలిసి అమలాపురం, పి.గన్నవరం, వీరవాసరం, ఆచంట, ఇరగవరం, పెనుగొండ, పెనుమంట్ర పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేశాడు. దొంగతనాలు చేయడం కోసం ప్రత్యేకంగా ఇనుప రాడ్‌లను తయారు చేయించుకున్నాడు. గతేడాది అక్టోబరు 22న ఆలమూరు పోలీసులు జైలుకు పంపారు. నవంబరు 23న జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ నాలుగు నెలల్లో ఉండ్రాజవరంలో 3, సమిశ్రగూడెం 3, పెనుమంట్ర 2, అయినవిల్లి, పెరవలి, రావులపాలెం, భీమడోలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కోటి చొప్పున 12 ఇళ్లను దోచేశాడు. ఈ క్రమంలో గత నెల 11న ఉండ్రాజవరానికి చెందిన సీపాని విజయలక్ష్మీ తన ఇంట్లో దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో నారాయణను నిందితుడిగా గుర్తించి ఈ నెల 8న ఉండ్రాజవరంలో అరెస్టు చేశారు. ఇతడిపై ఇటీవల నమోదైన 12 కేసుల్లో 630గ్రాముల బంగారు ఆభరణాలు, 4కిలోల వెండి వస్తువులు, సుమారు రూ.1లక్ష నగదు, టీవీ, మోటార్ సైకిల్, నేరానికి ఉపయోగించే స్క్రూడ్రైవర్లు, ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. చోరీ సొత్తును ముత్తూట్ వంటి ఫైనాన్స్ కంపెనీల్లో కుదువ పెట్టి ఆ డబ్బులతో క్రికెట్ బెట్టింగ్ ఆడడంతోపాటు విలాసాలకు ఖర్చు చేసేవాడని తెలిపారు. గతంలో నారాయణపై 57 కేసులు ఉన్నాయని, వాటిలో రెండు తీవ్రమైన నేరాలు ఉన్నాయని చెప్పారు. అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎల్.అర్జున్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, క్లూస్ టీం సీఐ స్వరూప్, ఉండ్రాజవరం, సమిశ్రగూడెం ఎస్ఐలు జి.శ్రీనివాసరావు, కె.వీరబాబు, సీసీఎస్ ఎస్ఐ రవీంద్ర, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

## రైళ్లలో దొంగతనాలు

### యువకుడి అరెస్ట్

### రూ.3.70 లక్షల సొత్తు స్వాధీనం

నిడదవోలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్ట్ చేసి బంగారం, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని భీమవరం రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమరాజు తెలిపారు. బుధవారం నిడదవోలు రైల్వే పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో సోమరాజు మాట్లాడుతూ రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నిడదవోలు మండలం శింగవరం గ్రామానికి చెందిన ఉలవలపూడి దుర్గారావు బుధవారం ఉదయం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుంటే అరెస్ట్ చేశామన్నారు. అతడిని విచారించి వివిధ కేసులకు సంబంధించి 30 గ్రాముల బంగారం, 18 సెల్ ఫోన్లు, సుమారు రూ.3లక్షల 70 వేల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ పి.అప్పారావు, సిబ్బంది ఉన్నారు.


నిడదవోలులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ

## 270 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్


నిందితుడి వివరాలు తెలుపుతున్న ఎస్పీ

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు 270కిలోల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ వివరాలను బుధవారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ రాజమహేంద్రవరంలో వెల్లడించారు. హరియాణాలోని సోనిపట్ గ్రామానికి చెందిన మోను సైనీ లారీ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఎన్ఎల్ 01 ఏజే 6162 నెంబరు కలిగిన కంటెయినర్ లారీలో విశాఖపట్నానికి ఫ్లైవుడ్ లోడు వేసుకుని వచ్చాడు. తిరుగుప్రయాణంలో నర్సీపట్నం ప్రాంతం నుంచి మరో వ్యక్తి అందజేసిన గంజాయి ప్యాకెట్లను డ్రైవరు క్యాబిన్ పైన ఉన్న మరో క్యాబిన్‌లో వేసుకున్నాడు. ఈగల్ బృందానికి వచ్చిన సమాచారంతో బొమ్మూరు పోలీసులను అప్రమత్తం చేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు సీఐ పి.కాశీ విశ్వనాథం నేతృత్వంలో వాహన తనిఖీలు చేపట్టారు. సదరు లారీని ఆపి తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం రూ.13.50లక్షలు విలువ చేసే 270కిలోల గంజాయి, లారీని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. లారీలోని అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి సందీప్‌శర్మ ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు. గంజాయికి సంబంధించి ఎలాంటి సమాచారమైనా పోలీసులకు తెలియజేయాలని, 112కి ఫోన్‌లో కూడా సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, రివార్డు అందిస్తామన్నారు. ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య, సీఐ కాశీ విశ్వనాథం, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## బీరు బాటిల్స్‌తో దాడి చేసిన ముగ్గురి అరెస్ట్

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి బీరు బాటిల్స్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు సర్పవరం ఎస్ఐ పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. కాకినాడ అర్బన్ కొత్త గైగోలుపాడుకు చెందిన పాలిక రమేష్, దాసరి రాజు, తిమ్మాపురం గ్రామం రాయుడుపాలెం సెంటర్‌కు చెందిన గంజ దుర్గాప్రసాద్ కలిసి ఈ నెల 1వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పాత గైగోలుపాడు పెంకేవారికాలనీలో మద్యం తాగేందుకు వచ్చారు. అక్కడకు మరో ఇద్దరు వచ్చారు. అప్పుడు ఏర్పడిన చిన్నపాటి వివాదం దాడికి దారితీసింది. నిందితులు ఉద్దేశపూర్వకంగా బాధితులపై బీర్ల బాటిల్స్‌తో దాడి చేసి తీవ్ర రక్తస్రావం అయ్యేలా చేశారు. బాధితుల ఫిర్యాదుతో సీఐ బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. ముగ్గురు నిందితులు ఉద్దేశపూర్వకంగానే హింసాత్మక దాడికి పాల్పడినట్టు దర్యాప్తులో తేలిందని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు పరారీలోఉన్నట్టు ఎస్ఐ చెప్పారు.

## యానాం ఎమ్మెల్యే ఫొటోతో పోస్టులు

### మహిళలను మోసం చేసిన రాజమండ్రి యువకుడి అరెస్ట్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యానాం ఎమ్మెల్యే ఫొటోను సామాజిక మాధ్యమాల్లో డీపీగా పెట్టుకుని మహిళలను మోసం చేసిన కేసులో రాజమహేంద్రవరానికి చెందిన ఓ యువకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన జోగాడ వంశీ కృష్ణ, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ గతంలో ఒకే కళాశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం వంశీ హైదరాబాద్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని తెలుస్తోంది. అతడి సోషల్ మీడియా ప్రొఫైల్ పిక్చర్‌గా ఎమ్మెల్యే ఫొటోను పెట్టుకోవడంతో పాటు అతడితో సాన్నిహిత్యంగా ఉన్నట్టు షాదీ.కామ్‌తోపాటు పలు వివాహ సంబంధిత ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో పోస్టులు పెడుతున్నాడు. అలా మోసపోయిన ఓ మహిళ ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం వంశీని అరెస్టు చేశారు. 4రాష్ట్రాల్లో సుమారు 26మంది మహిళలను మాయ మాటలతో నమ్మించి మోసం చేశాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్టు సమాచారం.

### మద్యం తాగి విధులకు హాజరు...

## అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ గార్డుల తొలగింపు

అన్నవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి విధులకు హాజరైన అన్నవరం దేవస్థానం ఇద్దరు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తప్పించారు. భద్రతా చర్యల కట్టుదిట్టంలో భాగంగా సెక్యూరిటీ గార్డులకు విధులకు హాజరయ్యే సమయంలో బ్రీత్‌ఎన్‌లైజర్ టెస్టులు చేయగా బుధవారం ఇద్దరు పట్టుబడ్డారు. ఇటీవల దేవస్థానం ట్రాన్స్‌పోర్టులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఈ విధంగా పట్టుబడగా అతడిపై చర్యలు తీసుకున్నారు.

## మనుమరాలే మోసం చేసింది!

### వృద్ధురాలి బంగారం అపహరణ కేసులో మనుమరాలు, మునిమనుమరాలు అరెస్టు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి కళ్లల్లో కారంకొట్టి బంగారం అపహరించిన కేసును పోలీసులు చేధించారు. మనుమరాలు, మునిమనుమరాలు ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించి అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం అర్జుననగర్‌లో ఒంటరిగా అద్దెకుంటున్న మండా హైమావతి (72) కళ్లల్లో కారం కొట్టి ఆమె చేతికి ఉన్న రెండు బంగారం గాజులను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా లాక్కుని వెళ్లిపోయిన ఘటనపై ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కాకినాడ సీసీఎస్, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ నెల 6వ తేదీ రాత్రి జరిగిన దొంగతనంపై నమోదు చేసిన కేసుపై విచారణను వేగవంతం చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, సీసీఎస్ సీఐ కృష్ణ పర్యవేక్షణలో విచారణ చేయగా వృద్ధురాలి మనమరాలైన చెల్లూరు దుర్గాభవాని, ఆమె కుమార్తె కలిసి సదరు దొంగతనం చేసినట్టుగా రుజువైంది. దీంతో వారిద్దరినీ అరెస్టు చేసి దర్యాప్తు నిమిత్తం బంగారం గాజులను స్వాధీనం చేసుకుని భవానీని రిమాండ్‌కు పంపించారు. బాలికను విశాఖపట్నంలోని బాలికల వసతిగృహానికి పంపించినట్టు ఎస్ఐ తెలిపారు.

## బైక్ ఢీకొని యువకుడి మృతి

రాజానగరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నామవరం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శాటిలైట్‌సిటీకి చెందిన మల్లమంతి సుధీర్ (23) మృతి చెందాడని రాజానగరం సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం.. శాటిలైట్ సిటీ నుంచి నామవరం వైపు బైక్‌పై వెళ్తున్న సుధీర్‌ను శాటిలైట్‌సిటీ వైపునకు వస్తున్న మరో వ్యక్తి బైక్ ఢీకొనడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

## రెట్టింపు పెట్టుబడి పేరిట దోపిడీ

### ఆన్‌లైన్‌లో రూ.8.68 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆండ్రాయిడ్ ఫోను టెలిగ్రామ్‌కు వచ్చిన ఒక లింక్ క్లిక్ చేస్తు మీపెట్టుబడికి రెట్టింపు డబ్బులు వస్తాయని వచ్చిన సందేశాన్ని నమ్మిన ఒక వ్యక్తి పలు దఫాలుగా రూ.8లక్షల 68వేలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలో మల్లయ్యపేటలో జరిగింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం... మల్లయ్యపేటకు చెందిన కే.వెంకటేశ్వరావు అనే వ్యక్తి ప్రైవేట్ కంపెనిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో జనవరి 27న తన ఫోన్‌లో టెలిగ్రామ్‌కు ఒక లింక్ వచ్చింది. దానిని క్లిక్ చేస్తే మీ పెట్టుబడికి రెట్టింపు నగదు వస్తుందని సందేశం రావడంతో దానిని నమ్మిన వెంకటేశ్వరావు తొలుత రూ.40 పెట్టుబడి పెట్టాడు. దానికి రెట్టింపు నగదు వచ్చింది. దీంతో అప్పట్నుంచి డబ్బులు పెట్టుబడి పెట్టుకుంటూ వచ్చాడు. చివరికి అతడు రూ.8 లక్షల 68 వేలు పెట్టుబడి పెట్టి తనకు రావాల్సిన డబ్బులు తన అకౌంట్‌కు బదిలీచేయాలని ఆన్‌లైన్‌లో సందేశం పంపాడు. దానికి అవతలి మోసగాళ్లు ఇంకా రూ.4లక్షలు పెట్టుబడి పెడితే మొత్తం నగదు బదిలీ చేస్తామని అనడంతో అనుమానంవచ్చి బాధితుడు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు నుంచి జారి పడి...


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ

తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. ఉల్లిపాడు- నర్సీపట్నం రైల్వేస్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తూ రైలు నుంచి 45 ఏళ్ల వ్యక్తి జారిపడినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఏ ఆధారాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచినట్టు ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు తుని రైల్వే స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

## పిఠాపురంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

పిఠాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సహృదయ మిత్ర మండలి వ్యవస్థాపకుల్లో ఒకరైన టీవీఎల్ నరసింహారావు మూడవ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ట్రినిటీ లూథరన్ చర్చి ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డాక్టర్ పీఎన్ రాజు ప్రారంభించారు. కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అవనిరాజేష్ ఆధ్వర్యంలో వైద్యులు సుమారు 210 మందిని పరీక్షించి 55 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. సాంఘిక సంక్షేమ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ అప్పారావు, మిత్రమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసు, సీహెచ్ సతీష్, చర్చి పాస్టర్ కె.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురం తాలూకా నూతన కార్యవర్గ సభ్యులతో కాకినాడ జిల్లా ప్రతినిధులు

## ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

పిఠాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిఠాపురం తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా జి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో బుధవారం జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ప్రధాన కార్యదర్శిగా కె.మధుసూదనరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా రాధాకృష్ణ, కోశాధికారిగా టీ.ప్రియదర్శిని, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.ప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, అప్పలరాజు, సాయికుమార్, లక్ష్మీపతి, భీమ, కామేశ్వరరావు, జాయింట్ సెక్రటరీలుగా డీఏ ఆజిబాబు, దేవీరంజిత, పద్మశేఖర్, పరీశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి వై.కల్పన వ్యవహరించారు. అనంతరం జరిగిన సమావేశంలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు జగన్నాథం, అసోసియేట్ అధ్యక్షుడు డీఏ రతన్‌రాజు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. తమకు చెల్లించాల్సిన మూడు డీఏలను, ఇతర బకాయిలను తక్షణం విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కాకినాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

## బీజేపీ క్రియాశీలక సభ్యుల సమావేశం

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీభవన్‌లో బుధవారం బీజేపీ నాయకుడు మోసలిగంటి సురేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పార్టీ విధానాలు, విశ్వసనీయతను వివరించారు. నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, పైడా వెంకటనారాయణ, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, ముత్తా నవీన్, కొక్కిలిగడ్డ గంగరాజు, పెండె శ్రీదేవి పాల్గొన్నారు.

**పెద్దాపురం (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బుధవారం క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. జనసంఘ్ నుంచి బీజేపీ కోసం పనిచేసిన సుంకవిల్లి బాపిరాజు, దుర్గామోహన్‌రావులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సత్కరించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు సాహితివర్మ, గోరకపూడి చిన్నయ్యదొర, తుమ్మల పద్మజ, బొలిశెట్టి రాంకుమార్, పెంకే పుష్పలత, పోతుల ప్రభాకర్, పుప్పాల నాగగోవిందు తదితరులు పాల్గొన్నారు.

## 'నారీ శక్తి' రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కాకినాడ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి నారీ శక్తి పథకం ద్వారా తమ బ్యాంకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ సాయిమనోహర్ కోరారు. బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో బుధవారం ఏడుగురు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. పాలీసెట్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పతంజలి యోగా సమితి సభ్యులు సమకూర్చిన స్టడీ మెటీరియల్ అందజేశారు. ట్రస్టీ వీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా యూబీఐ రీజనల్ హెడ్ సాయి మనోహర్, విశిష్ట అతిథిగా పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు రాఘవానంద ముడుంబ, గౌరవ అతిథిగా యూబీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు జేఎస్‌వీ శ్రీనివాస్ హాజరయ్యారు. ట్రస్ట్ సభ్యులు శాంతి, వినయ్, రామకృష్ణ, తాతారావు, బి.శ్రీనివాసరావు, వి.మల్లికార్జునరావు, ఆర్‌జే రామారావు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న దృశ్యం

## 'పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరలు తగ్గించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నగర కమిటీ సభ్యుడు సత్తిరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై అత్యంత దారుణంగా భారాలు వేస్తోందన్నారు. తద్వారా నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పరోక్షంగా మరింత భారం పడుతుందన్నారు. నగర కన్వీనర్ వీరబాబు, సభ్యులు మలక వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, భూలక్ష్మి, రాణి, తలుపులమ్మ, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

## 'పీఎం ప్రాణమ్ పథకంపై అవగాహన పెంపొందించుకోవాలి'

సామర్లకోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం ప్రాణమ్ సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని మద్రాస్ ఫెర్టిలైజర్స్ ప్రాంతీయ మేనేజరు చంద్రశేఖర్ సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామర్లకోట మండలం ఉండూరులోని రైతు సేవా కేంద్రం ఆవరణలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై కాకినాడఏడీఏ రత్నప్రశాంతి అధ్యక్షతన బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో పీఎం ప్రాణమ్ పథకం ద్వారా 14 రాష్ట్రాల్లో 15.14 మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులు వినియోగం తగ్గించామన్నారు. అనంతరం రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో సేంద్రియ వ్యవసాయాన్ని పరిశీలించారు. జిల్లా రైతు శిక్షణా కేంద్రం డీడీఏ బి.హరి, సామర్లకోట మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, ఏడీఏ మాధవి, ఏవో సంజీవ్‌కుమార్, కిషోర్‌బాబు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఆర్ఎం చంద్రశేఖర్

## మరిడమ్మ అమ్మవారికి మఖ నక్షత్ర పూజలు



పెద్దాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ అమ్మవారికి మఖ నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున మూలవిరాట్టుకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి సుగంధభరిత పుష్పాలతో విశేషంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

## కరపలో ఎమ్మెల్యే నానాజీ విస్తృత పర్యటన

కరప, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం కరపలో పర్యటించి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా బీసీ హాస్టల్‌ను సందర్శించి రూ.5లక్షలతో నిర్మించిన భోజనశాలను ప్రారంభించారు. అక్కడ తిష్టవేసిన పలు సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. హాస్టల్ పరిసరాలు, గదులు అత్యంత దారుణంగా ఉండడంతో ప్రిన్సిపాల్ రామకృష్ణను ప్రశ్నించారు. అన్ని సమస్యలకు విద్యార్థులే మూలమని ప్రిన్సిపాల్ దాటవేసే సమాధానాలు చెప్పడంతో ఎమ్మెల్యే ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. సమస్యలను పరిష్కరించేందుకు ఏమి చేయాలో చెప్పడం మానేసి విద్యార్థులను బాధ్యులు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై నివేదిక అందించాలని ఉన్నతాధికారులతో మాట్లాడి హాస్టల్‌కు అన్ని వసతులు కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశమై కార్పొరేషన్ రుణాలపై చర్చించారు. చంద్రన్న సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కరప, కాకినాడ రూరల్ మండలాలకు చెందిన 19మంది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వీల్‌చైర్లు, రోలెటర్స్, చెవి మిషన్లు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాల వద్ద విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు ఎమ్మెల్యే విచ్చేసి ర్యాలీని ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. పలువురు చిన్నారులకు అడ్మిషన్లు అందజేశారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, ఏసుదాసు, ఏవో బీఎల్ నరసింహం, ఈవోపీఆర్డీ సలాది శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీలు వైవీ లక్ష్మి, సీహెచ్ వీరగణేష్, కె.స్వాతి, ఎస్.మల్లీశ్వరి, కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, జనసేన నాయకులు పంతం సందీప్, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, తుమ్మలపల్లి గోవిందరాజులు, యాళ్ల పండు, పేకేటి ప్రసాద్, జోకా తాతాజీ, పేపకాయల అంజి, జిల్లెల ప్రసాద్, శంకర్, పుణ్యమంతుల అన్నారం, వెలుగుబంటి సూరిబాబు పాల్గొన్నారు.



చిన్నారికి ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

## కాకినాడ జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక

పిఠాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం సాయంత్రం బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళా జట్లను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి యూత్ పోటీల్లో కాకినాడ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపిక పోటీలను మునిసిపల్ కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనుబాబు, జిల్లా రగ్బీ అసోసియేషన్ సభ్యుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్ ప్రారంభించగా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృపారావు, కోచ్ పి.లక్ష్మణరావు పర్యవేక్షించారు.

మహిళా జట్టుకు: 48కిలోల విభాగంలో ఎ.దేవి (కోటనందూరు), 51 కిలోల విభాగంలో సీహెచ్ భువనేశ్వరి (కోటనందూరు), 54 కిలోల విభాగంలో పి.మహాలక్ష్మి (పిఠాపురం), 57 కిలోల విభాగంలో డి.శ్యామల (కాకినాడ), 60 కిలోల విభాగంలో పి.రత్నం (పిఠాపురం), 65 కిలోల విభాగంలో డి.లలిత (పిఠాపురం), 70 కిలోల విభాగంలో ఏఎస్ఎస్ వైష్ణవి (మల్లాం), 80 ప్లస్ ఓపెన్ వెయిట్ కేటగిరీలో జె.ఐశ్వర్య సూర్యదీపిక (పిఠాపురం), పురుషుల విభాగం: 50 కిలోల కేటగిరీలో కె.అభిలాష్ (తుని), 60 కిలోల కేటగిరీలో వీవీవీ రమణ (వి.దొంతమూరు) ఎంపికయ్యారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాక్సింగ్ క్రీడాకారులు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న జన సైనికులు



గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న జన సైనికులు

## పాదగయలో మహా మృత్యుంజయ హోమం

పిఠాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ ఈశ్వర్‌కు త్వరితగతిన స్వస్థత చేకూరాలని ప్రార్థిస్తూ పట్టణంలోని పాదగయ క్షేత్రంలో బుధవారం మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ సూచన మేరకు జనసైనికులు కుక్కుటేశ్వరస్వామికి అమృత మృత్యుంజయ పాశుపత అభిషేకం, నక్షత్ర నవగ్రహ మృత్యుంజయ హోమం, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమార్చన జరిపారు. జనసైనికులు వీరంరెడ్డి చక్రి, దానం లాజర్‌బాబు, బాలిపల్లి రాంబాబు, రెడ్డెం జనార్దన్, కరణం సూరిబాబు, తోలేటి శిరీష తదితరులు పాల్గొన్నారు. మార్క్ ఈశ్వర్‌కు సంపూర్ణ ఆరోగ్యం కలగాలని కోరుతూ పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద గల అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు భమిడిపాటి శ్రీనివాసశర్మ అష్టోత్తర సింధూర పూజ, మృత్యుంజయనామ జపం జరిపారు. జన సైనికులు బొజ్జా రాంప్రసాద్, తలారి శ్రీనివాస్, మొగలి రాజా, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి):** పవన్ చిన్న కుమారుడు మార్క్ ఈశ్వర్‌కు సంపూర్ణ ఆరోగ్యం కోరుతూ తాటిపర్తి అపర్ణాదేవికి కుంకుమపూజ చేశారు. జనసేన నాయకులు మాదేపల్లి శ్రీనివాసరావు, బవిరిశెట్టి రాంబాబు, అమరాది వల్లీరామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 'తాటిపర్తి చెరువులో అక్రమ మైనింగ్ ఆపాలి'

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి కోదండ రాముని చెరువులో అక్రమ మైనింగ్ నిరోధానికి చర్యలు తీసుకోవాలని చెరువు నీటి సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఈ మేరకు గొల్లప్రోలు తహసీల్దారు. ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. రాత్రివేళల్లో ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు సాగించి ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్, మట్టి తరలిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే 20అడుగులకు పైగా లోతు గోతులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## జగన్ వ్యాఖ్యలకు ఖండన

కాకినాడ క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసులనుద్దేశించి మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పి.సత్యమూర్తి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల బట్టలు ఊడదీస్తానని జగన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గంగా ఉన్నాయన్నారు. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని పోలీస్ శాఖకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నిరసన

కరప, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ కాజులూరు మండలం కోలంకలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు ఆధ్వర్యంలో స్థానికులు బుధవారం నిరసన తెలిపారు. నాయకులు బొండా దొరబాబు, వెంకన్నబాబు, పెదిరెడ్డి వెంకటేశ్వర్లు, బూరెల సూరిబాబు, పల్లపురాజు, నందికోళ్ల సత్తిబాబు, పెదిరెడ్డి రాజు పాల్గొన్నారు.

## క్రికెట్ స్టేడియం నిర్మాణానికి భూముల పరిశీలన

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో భావనారాయణస్వామికి చెందిన సర్వే నెం.113,114ల్లో సుమారు 18 ఎకరాల భూములను కలెక్టర్ షాన్ మోహన్, దేవదాయ శాఖ అధికారులతో కలిసి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ పరిశీలించారు. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి అవసరమైన భూములను చూశారు. ఎండోమెంట్ రికార్డుల ప్రకారం భూమి విస్తీర్ణం, రికార్డులను పరిశీలించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఆర్డీవో మల్లిబాబు, దేవదాయ శాఖ ఉప కమిషనరు రమేష్‌బాబు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, బీజేపీ, జనసేన నాయకులు మామిడాల శ్రీనివాసరావు, పుల్ల శ్రీరాములు పాల్గొన్నారు.



మ్యాప్‌లో ఆలయ భూముల వివరాలను పరిశీలిస్తున్న ఎంపీ సతీష్, కలెక్టర్ షాన్‌మోహన్

## లోకేశ్ పాదయాత్రతోనే టీడీపీకి అధికారం

### పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ

కాకినాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రే ప్రధాన కారణమని టీడీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ వెల్లడించారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి సిద్ధం చేసిన 2047 ప్రణాళికను నారా లోకేశ్ నాయకత్వంలో, చంద్రబాబు ఆలోచనా విధానంలో నడుస్తున్న టీడీపీలోనూ అమలు చేయాలని వర్మ కోరారు. పార్టీకి భవిష్యత్తు ప్రణాళిక అవసరమని, లోకేశ్ రూపొందించిన కార్యకర్తే అధినేత కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. 2008లో నగదు బదిలీ పథకం, 2014లో 45లక్షల సభ్యత్వాలు నమోదు, కార్యకర్తలకు బీమా సౌకర్యం, 2024లో కోటిమందికి సభ్యత్వాలు కల్పించి వారికి బీమా సౌకర్యం కల్పించిన ఘనత నారా లోకేశ్‌దేనన్నారు. 2014-19లో రాష్ట్రం విడిపోయినప్పుడు రూ.వేల కోట్ల నిధులు తీసుకురావడంలో నారా లోకేశ్ ఎంతో కృషి చేశారన్నారు. పంచాయతీరాజ్ శాఖమంత్రిగా నారా లోకేశ్ 75శాతం రోడ్లను గ్రామాల్లో పూర్తి చేశారన్నారు. విద్యావిధానంలో మార్పులు తీసుకొస్తున్న నారా లోకేశ్‌కు పార్టీ కార్యకర్తలు మద్దతు ఇవ్వాలన్నారు. 2018లో టీడీపీ పని అయిపోయిందనుకున్న సమయంలో పార్టీని బలమైన శక్తిగా నిలిపింది నారా లోకేశేనన్నారు. కాకినాడ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కార్యకర్తలు వారి నియోజకవర్గాల్లోని సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు.



ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



## ప్రమాదపుటంచున...

స్కూళ్లకు పిల్లలను తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్త వహించాలని ఆటో డ్రైవర్లకు పోలీసులు ఎన్నిసార్లు కౌన్సిలింగ్ ఇస్తున్నా కొందరి తీరు మాత్రం మారట్లేదు. అందుకు ఉదాహరణే ఈ చిత్రం... ఆటో వెనుక భాగంలో నిండుగా బ్యాగులు... వాటి పక్కన ప్రమాదకర రీతిలో విద్యార్థి... ఆటో ఎడమ భాగంలో బయట నించుని మరో విద్యార్థి... వాహనం ఏమాత్రం అదుపు తప్పినా వారి ప్రాణాలకే ముప్పు. నగరంలోని గాంధీనగర్‌లో గల ఒక స్కూలు నుంచి విద్యార్థులను ప్రమాదకర రీతిలో తీసుకెళ్తుండగా 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది.

**ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ**

## రేపు మెగా జాబ్ మేళా

సామర్లకోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయి మెగా జాబ్ మేళాను శుక్రవారం పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం చెప్పారు. వికాస ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగే మేళాలో ప్రముఖ సంస్థలకు చెందిన 35 హెచ్‌వోడీలు ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక ఉత్తర్వులు అందజేస్తారన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన యువతీ, యువకులు హాజరు కావాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు.



## ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరణ

కాకినాడ సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంబమూర్తినగర్‌లోని ప్రభుత్వ బధిరుల పాఠశాలకు వాకలపూడి యూనివర్సల్ బయోఫ్యూయల్స్ సంస్థ రూ.2లక్షల సీఎస్ఆర్ నిధులతో 500 లీటర్ల సామర్థ్యం గల ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరించింది. బుధవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారులు, బధిరుల పాఠశాల హెచ్ఎం, కాజులూరు ఎంఈవో డి.డేవిడ్, యూనివర్సల్ బయోఫ్యూయల్స్ జనరల్ మేనేజరు కె.వసంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.



## 'ప్రతిభ'లో గ్రాడ్యుయేషన్ డే

సామర్లకోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతిభ స్కూల్లో బుధవారం సాయంత్రం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారుల విచిత్ర వేషధారణలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. వారికి డైరెక్టర్ సుధారాణిప్రకాష్ సర్టిఫికెట్లు అందజేశారు. టి.సునీత, వి.శ్రీగౌరి, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం మల్లాంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ బుధవారం రాత్రి ప్రారంభించారు. అంబేడ్కర్ యూత్ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## వాకర్స్ గ్రంథాలయం సందర్శన

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బోట్ క్లబ్ పార్కులో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని కలెక్టర్ షాన్ మోహన్ బుధవారం సందర్శించారు. మేగజైన్లు, పేపర్లు, మౌలిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రూ.31వేలు విలువైన 344 పుస్తకాలను అందజేశారు. కలెక్టర్‌కు వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు.

## నూకాలమ్మను దర్శించుకున్న రమేష్

పెద్దాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాండ్రకోట నూకాలమ్మ తల్లిని జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చన చేశారు.

## పిఠాపురంలో మెగా వైద్య శిబిరం

పిఠాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రథాలపేట బీసీఎం స్కూలు ఆవరణలో బుధవారం ఏవైఎఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. న్యూ సమత ఆసుపత్రి వైద్యులు సుమారు 500 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి రక్త, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఏవైఎఫ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అన్నవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అన్నవరం 11 కేవీ ఫీడర్, దేవస్థానం ఫీడర్, ఆర్టీసీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నవరం, గోపాలపట్నం, మండపం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరభద్రరావు తెలిపారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## గిరిజన యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు

### ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పర్యాటక ప్రాంత, ఖనిజ సంపద అభివృద్ధి, మిని పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆమె శాసనమండలి సభ్యులు అనంత ఉదయ భాస్కర్, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీలతో కలిసి ఏజెన్సీ మండలాల వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో అభిప్రాయాల సేకరణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ పరిధిలో జీడిపిక్కల ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. భూపతిపాలెం, ముసురుమిల్లి జలాశయాల అభివృద్ధి, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఎమ్మెల్సీ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. జీడిపిక్కల కొనుగోలు కేంద్రాల వద్ద తూకాల్లో మోసం లేకుండా డిజిటల్ కాటాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ గిరిజనులు ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జీడిపిక్కల కొనుగోలు కేంద్రాల్లో మోసాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి నందు, డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏడీఏలు సీహెచ్‌కేవీ చౌదరి, కె.సావిత్రి, తహశీల్దార్లు పి.రామకృష్ణ, కరక సత్యనారాయణ, ఏవీ సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, వేణుగోపాల్, ఎంపీడీవోలు బాపన్నదొర, విశ్వనాథ్, ఏజెన్సీ మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గిరిజన తెగల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మన్యంలో పర్యాటకం, మైనింగ్‌లపై సర్వత్రా వ్యతిరేకత

### ఐటీడీఏ సదస్సులో గిరిజన ప్రతినిధుల ఏకరువు

రంపచోడవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మన్యంలో పర్యాటకం, మైనింగ్ కార్యకలాపాలపై బుధవారం రంపచోడవరం ఐటీడీఏలో జరిగిన సదస్సులో సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, గిరిజన వర్గాల ప్రతినిధులతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీలు సదస్సు నిర్వహించారు. సదస్సు ఆద్యంతం గిరిజన వర్గాల నుంచి మెజారిటీగా మన్యంలో గిరిజనుల అస్థిత్వానికి దారితీసే పర్యాటక రంగ విస్తరణ, మైనింగ్ కార్యకలాపాలను వ్యతిరేకిస్తూ గిరిజన నాయకులు పల్లాల రాజ్‌కుమార్ రెడ్డి, వెదుళ్ల లచ్చిరెడ్డి తదితరులు మాట్లాడారు. ఈఅంశాలపై ఐటీడీఏ స్థాయిలో కాకుండా గ్రామ, మండలాల స్థాయిల్లో పీసా చట్టం మేరకు సభలను నిర్వహించి గిరిజనుల అభిప్రాయాలను తీసుకుని నిర్ణయం తీసుకోవాలని కోరారు. మరికొందరు ఈ రంగాలను వృద్ధిపర్చాలని కోరారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మాట్లాడుతూ గిరిజన ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలని సూచించారు. గిరిజన అభిప్రాయాల మేరకు తదనంతర చర్యలు తీసుకుంటామని, జూన్‌లో మళ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రాజెక్టు అధికారి సింహాచలం తెలిపారు.

## మా పంచాయతీలను ముంపు గ్రామాలుగా పరిగణించండి

కూనవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోచవరం, కాచవరం పంచాయతీలను ముంపు గ్రామాలుగా పరిగణించి, ఈగ్రామాల నిర్వాసితులకు పోలవరం పరిహారం అందించాలని ఆయా గ్రామాల నిర్వాసితులు ధవళేశ్వరంలో పోలవరం ఆర్‌అండ్‌ఆర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అభిషేక్‌ను కలిసి కోరారు. వరదలు వస్తే ఈపంచాయతీల్లోని గ్రామాలను గోదావరి వరద చుట్టుముడుతుందని, వరద బయటకు వెళ్లే పరిస్థితి ఉండదని, దీంతో ప్రజలు నిర్వాసితులవుతున్నారని ఆయనకు వివరించారు. దీనిపై అభిషేక్ స్పందిస్తూ ఈవిషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, నిర్వాసితులకు న్యాయం జరిగే విధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేశుల రంజిత్‌కుమార్, నల్లగొర్ల రాజు, షేక్ సుభానీ, పూనెం శ్రీరాములు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, రాంబాబు, ఈశ్వరరావు, ఆలూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌అండ్‌ఆర్ అడ్మినిస్ట్రేటర్‌ను కలిసిన పోచవరం, కాచవరం నిర్వాసితులు

## రేపు కార్పొరేషన్ రుణాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

దేవీపట్నం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల11వ తేదీ ఉదయం ఇందుకూరుపేట వెలుగు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల నుంచి 271 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. బ్యాంక్ మేనేజర్లు, ఎంపీడీవో సమక్షంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

## ఈదురుగాలులతో భారీ వర్షం

వై.రామవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వై.రామవరంలో బుధవారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు చోట్ల చెట్లు, చెట్టు కొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. మంగళ, బుధవారాల్లో వరుసగా రెండు రోజులు వీచిన గాలులు, వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


వై.రామవరంలో కురుస్తున్న వర్షం

## ఎంపీపీ వెంకటలక్ష్మికి సత్కారం

రాజవొమ్మంగి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పాడేరులో నిర్వహించిన జిల్లా స్థాయి అభివృద్ధి సమావేశంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మిని అరకు ఎంపీ తనూజారాణి ఘనంగా సత్కరించారు. మండల సమస్యలను కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కార దిశగా కృషిచేస్తూ, గిరిజన సమస్యలపై ఆమె చూపుతున్న బాధ్యతను అభినందిస్తూ ఎంపీపీ వెంకటలక్ష్మికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తదితరులు ఉన్నారు.


ఎంపీపీ వెంకటలక్ష్మిని సత్కరిస్తున్న అరకు ఎంపీ తనూజా రాణి

## ఉత్సవమూర్తుల ఊరేగింపు

రాజవొమ్మంగి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్మరిపేట శ్రీకోదండ రామాలయం సీతారాముల కల్యాణం పురస్కరించుకుని సంప్రదాయం ప్రకారం 4వ రోజు బుధవారం గ్రామ పురవీధుల్లో భాజాభజంత్రీలతో సీతారాముల ఉత్సవమూర్తులను బుధవారం ఊరేగించారు. ఈఊరేగింపులో ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకున్నారు. మలిరెడ్డి సత్యనారాయణ, ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం మలిరెడ్డి గోవింద్ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

## హక్కుల పరిరక్షణకు తీర్మానం

లబ్బర్తి పంచాయతీ నెల్లిమెట్లలో బుధవారం పేసా గ్రామసభ జరిగింది. పేసా ఉపాధ్యక్షుడు తాము సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన సభకు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. మౌలిక సదుపాయాల కల్పన నేపథ్యంలో అనేక సమస్యలు గుర్తించి తీర్మానం చేశారు. గిరిజన సంస్కృతి, ఆచార వ్యవహారాలను, హక్కులను పరిరక్షించుకుందామని తీర్మానం చేశారు. 30సమస్యలను పరిష్కరించారు. సభలో ఉపసర్పంచ్ బత్తిన రాజేశ్వరి, ఈక ఆదినారాయణ, ముర్రం నూకరత్నం, ఈక కౌసల్య, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణారెడ్డి, వీఆర్వో నాగేశ్వరరావు, ఏపీవో రెడ్డిబాబు, టీఏ శ్రీను, ఏఈఓ దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లపుఊట ధ్వంసం

మండలంలో బుధవారం ఎక్సైజ్ అధికారులు 1400లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కిర్రాబు పంచాయతీ మడేరు వాగు సమీపంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. సారా బట్టీ నిర్వహిస్తున్న వ్యక్తిని, ఆ వ్యక్తికి బెల్లం సరఫరా చేస్తున్న వర్తకుడిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీధర్ తెలిపారు. ఏడు డ్రమ్ముల్లో ఉన్న 1400లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

## గ్రామాల్లో పల్లె పండుగ

### ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, డ్వామా పీడీ వెంకటలక్ష్మి హాజరు

జగ్గంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం రాజపూడి, గోవిందపురం, వెంగయమ్మపురం, మల్లిశాల గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై రూ.90లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. రాజపూడిలో నిర్మించిన గోకులం షెడ్డు ప్రారంభించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు,ఉంగరాల రాము, రేఖ బుల్లిరాజు, సర్పంచులు బుసాల విష్ణు, ఉప్పలపాటి బుల్లబ్బులు, కమ్మిల వెంకటేశ్వరరావు, సర్పసిద్ది నూకరత్నం, లక్ష్మణరావు, పైడిపాల సూరిబాబు, ఎర్ర బాబు, వల్లెన అన్నవరం, పంచాయతీరాజ్ డీఈ ఉమాశంకర్, జేఈ నారాయణమూర్తి, ఎంపీడీవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### కొత్త వ్యవస్థకు శ్రీకారం : ఎమ్మెల్యే

టీడీపీలో కుటుంబ సాధికార సారథుల పేరిట కొత్త వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెల్లడించారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో గోకవరం మండల కుటుంబ సాధికార సారథుల నియామకంపై అవగాహన సదస్సు గోకవరం మండలాధ్యక్షుడు మంగ నౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి 60 కుటుంబాలకు ఈ సాధికార సారథి ఇన్‌చార్జ్‌లుగా ఒక పురుషుడు, ఒక మహిళ వ్యవహరిస్తారన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించేలా ఈ సారథులు పని చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడప భరత్‌బాబు, సూరంపాలెం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఉంగరాల రాము, మల్లవరం, తిరుమలాయపాలెం సర్పంచ్‌లు యిడుదల లక్ష్మి, అర్జునరావు, పురంశెట్టి శివాజీ, గోకవరం మండల నాయకులు పల్ల అర్జున సారథి, ఎస్.బాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం : ఎమ్మెల్యే దివ్య

కోటనందూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బుధవారం కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల నుంచి 82 ఫిర్యాదులు వచ్చాయని, అందులో ప్రధానంగా రెవిన్యూ సమస్యలు ఉన్నాయని పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై యంత్రాలు, స్ప్రేయర్లను రైతులకు అందజేశారు. 499 డ్వాక్రా సంఘాలకు రూ.48 కోట్లు, 171 మందికి ఉన్నతి రుణాలను రూ.85 లక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నేత యనమల రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ జడ్పీటీసీ పెంటకోట భాస్కరసత్యనారాయణ, డిచిరీంజీవిరాజు, అంకంరెడ్డి రమేష్, వెలగా వెంకటకృష్ణారావు, చిటికెల సత్యనారాయణ, షేక్‌నవాబ్ జానీ, పెనుముచ్చు నాగేశ్వరరావు, యర్ర చిన సత్యనారాయణ, వాసం నాగేశ్వరరావు, అంకంరెడ్డి బుల్లిబాబు, ఎంపీడీవో వెంకటనారాయణ, తహశీల్దార్ సుభాష్, వ్యవసాయశాఖాధికారి చంద్రశేఖర్, ఏపీఎమ్ సూర్యకుమారి రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.


కోటనందూరు ప్రజాదర్బార్‌లో వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

### సామాజిక సేవకు ముందుకురావాలి

తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తుని మండలం ఎస్.అన్నవరం శివారు కవలపాడులో వాసవి చారిటబుల్ ట్రస్ట్, వాసవి క్లబ్, వాసవీ వనితా క్లబ్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, టీడీపీ యువ నాయకుడు యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి), యినిగంటి సత్యనారాయణ, సుకుమంచిశోభారాణి, మళ్ల గణేష్, తుని మున్సిపాల్టీ ఇన్‌చార్జ్ చైర్మన్ కొచ్చేర్లపాటి రూపాదేవి, అప్పన రమేష్, తదితరులు ఉన్నారు.

## కిడ్నీ బాధితురాలికి సహాయం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కంటోజు హైమకు ప్రత్తిపాడు విశ్వ బ్రాహ్మణ సంఘం రూ.16,200 సహాయం అందించింది. బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గానాల గంగాల గంగాధర్, జిల్లా క్రమశిక్షణ కమిటీ వైస్‌చైర్మన్ ధర్నాల కోట శ్రీను, ఉపాధ్యక్షుడు దర్నాలకోట వీరబాబు, ఎ.రమణ ధర్మవరం విచ్చేసి బాధితురాలికి సాయం అందించారు. దవరసింగ్ అబ్బులు, విశ్వబ్రాహ్మణ సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ సమావేశం

జగ్గంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో బీజేపీ క్రియాశీలక సభ్యుల సమావేశం క్షత్రియ పరిషత్ హాల్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో జగ్గంపేట అసెంబ్లీ కన్వీనర్, ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ దాట్ల కృష్ణవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండల అధ్యక్షులు సుమారు 90 మంది క్రియా శీలక సభ్యులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు త్వరితగతిన పూర్తి చేయాలి : ఎంపీడీవో

గండేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ద్వారా మంజూరైన ఇంకుడుగుంతలు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో నాతి బుజ్జి ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. ఆమె బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏపీవో శ్రీహరి రాజు, ఈసీ రమేష్, క్వాలిటీ కంట్రోల్ జేఈ స్వాతి, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీను, మోహన్, అబ్బులు, శ్రీను సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

రౌతులపూడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శృంగవరంలో గ్రామంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి అధికారుల పట్టుకున్నారు. సమాచారం మేరకు సీఎస్ డిప్యూటి తహశీల్దార్ ఆర్ఎస్‌కే ప్రసాద్ దాడి చేసి రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. 6 ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## మురారి దుర్గ సన్నిధిలో ఎమ్మెల్యేల సతీమణులు


అమ్మవారి సన్నిధిలో పూజలో పాల్గొన్న దృశ్యం

గండేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మురారి తోటలో వెలసిన దుర్గమ్మను బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణమ్మ, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల్లో జ్యోతుల నెహ్రూ, బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీ ఎమ్మెల్యేలుగా విజయం సాధిస్తే మురారి దుర్గమ్మకు మొక్కు తీర్చుకుంటానని రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన పాల శివరామకృష్ణ మొక్కుకున్నారు. బుధవారం ఆ మొక్కు చెల్లించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ, కౌడా చైర్మన్ తుమ్మలబాబు, అడబాల ఆంజనేయులు, జ్యోతుల మూర్తి ఉన్నారు.

## ఉచితంగా నాణ్యమైన విద్యను పొందండి

కిర్లంపూడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాడ హైస్కూల్ ప్లస్‌లో నిర్వహిస్తున్న బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ కోర్సుల్లోకి ప్రవేశాల కోసం డ్రైవ్ తామరాడ, గోనేడలలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ప్రధానోపాధ్యయుడు ఎల్.కృష్ణ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను ప్రతీ ఒక్కరికీ అందజేస్తామన్నారు. ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేయడమే కాకుండా మధ్యాహ్న భోజన సదుపాయం, వారాంతపు పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థినులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. 37 మంది విద్యార్థినులు ప్రవేశాలు పొందారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బావిశెట్టి లక్ష్మీనారాయణ, బాలిన నూకరాజు, వై.ఏసుబాబు, డి.చంద్రశేఖరరావు, కస్తూరి శివప్రసాద్ తదితరులున్నారు.

## యనమలను కలిసిన కాకినాడ ఎంపీ


యనమలను సత్కరిస్తున్న కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్

తుని రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును మర్యాద పూర్వకంగా కలిశారు. 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తిచేసుకుని ప్రజా జీవనంతో ముందుకుసాగుతున్న యనమలకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాభినందనలు తెలిపారు. యనమల సలహాలు,సూచనలు నేటి యువ నాయకత్వానికి ఎంతో అవసరమన్నారు.

### ఆదివాసీ హక్కులు, చట్టాలను ఉల్లంఘిస్తే

## ప్రతిఘటన ఉద్యమాలు

### అఖిల భారత రైతుకూలీ సంఘం

రంపచోడవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధి పేరుతో ఆదివాసీ చట్టాలు, హక్కులు, న్యాయ స్థానాల తీర్పులను, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తే అంబేడ్కర్, పూలే, అల్లూరి సీతారామరాజు, కొమరం భీం స్ఫూర్తితో ఆదివాసీలను ఐక్యం చేసి ప్రతిఘటన ఉద్యమాలు చేపడతామని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ్య కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం స్థానిక మార్క్స్ ఏంగెల్స్ భవనంలో ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యవర్గం ఆధ్వర్యంలో డివిజన్ సహాయ కార్యదర్శి కత్తుల బాలురెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లచ్చిరెడ్డి, దూలయ్య మాట్లాడుతూ ఆదివాసీ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను నాశనం చేసే పర్యాటక విచ్చలవిడి విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. మన్యంలో సంవత్సర కాలంలోనే వివిధ కారణాలతో 300అనుమానాస్పద మరణాలు సంభవించాయని, అంతకు రెండు రెట్లు మించి రహదారి ప్రమాదాలు నమోదయ్యాయన్నారు. హెచ్ఐవీ, క్షయ వంటి ప్రమాదకర రోగాల రేటు విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యాటక అభివృద్ధి పేరుతో ఆదివాసీ సమాజాన్ని విధ్వంసం చేసే ప్రతిపాదనలను సమాజం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ కూటమి జేఏసీ నాయకులు, పీడీఎస్‌యూ, పీవైఎల్ డివిజన్ సభ్యులు ఎం.ప్రసాద్‌దొర, పి.ఆదిలక్ష్మి, పి.మంగిరెడ్డి, బాలుదొర, ఐ.వి.రమణ పాల్గొన్నారు.

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

జగ్గంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడరోడ్‌లోని బాలాజీ జ్యువలర్స్ ఎదురుగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సేవా సంఘం ప్రధాన కార్యదర్శి బొండాడ జగన్ తనయుడు లయకర్ పుట్టిన రోజు సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, జిల్లా వాసవి గవర్నర్ మానేపల్లి బంగారాజు, బొండాడ జగన్, ముమ్మిడివరపు సురేష్, పొట్టి వీర్రాజు, మానేపల్లి రామానుజ, మాతంశెట్టి నారాయణ, ఉద్దగిరి కామేస్, కాకి ఆనంద్ పాల్గొన్నారు.

## ముగిసిన భద్రతా మాసోత్సవాలు

తొండంగి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఒంటిమామిడి దివిస్ పరిశ్రమలో నెలరోజులుగా నిర్వహించిన భద్రతా మాసోత్సవాలు బుధవారంతో ముగిసాయి. జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా మార్చి 4న ప్రారంభమైన నెలరోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యోగులకు భద్రతా పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందించారు. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ మురళీ కృష్ణ, డిప్యుటీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణలు ముఖ్య అతిథిగా హాజరై భద్రతా ప్రమాణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ నాగేశ్వర్ పరిశ్రమలో తీసుకుంటున్న భద్రతా ప్రమాణాల గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్లు రావి సుధాకర్, బి.వాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు మెరుగైన వైద్యం

శంఖవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ) అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ యోజన పథకంలో భాగంగా శంఖవరం ఆసుపత్రిలో గర్భిణులు జనసేన మండల ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి భోజనాన్ని అందించారు. కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, తలపంటివీరబాబు, తలపంటి కృష్ణ పాల్గొన్నారు.

## కొనసాగిన ఆర్టీసీ కార్మికుల నిరసన

ఏలేశ్వరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో కార్మికులు ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన బుధవారం కొనసాగించారు. జేఏసీ నేతృత్వంలో పివై బాబు, ఎం.ప్రసాద్ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. సర్క్యులర్‌కి విరుద్ధంగా డ్రైవర్ ఎస్‌వి రమణపై సస్పెన్షన్ పెట్టి విధుల నుంచి తొలగించడం సరికాదని సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని 47వరోజు ఎర్ర బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. యాజమాన్యం వెంటనే స్పందించి రమణను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఎస్ఎమ్‌యూ కార్యదర్శి కె.త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి యు.బి.ఎం కుమార్, ఎన్‌పీ రావు, త్రిమూర్తులు మద్దతు తెలియజేశారు.